# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 10-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ విదేశీ పర్యటన ముగించుకుని ఈరోజు ఉదయం భారత్ చేరుకున్నారు.

❖ భారత్ ప్రపంచ శక్తిగా ఎదిగేందుకు మేధో సంపత్తి, సాంస్కృతిక పురోగతి చాలా ముఖ్యమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.

❖ బీహార్ ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టేందుకు ఎన్నికల సంఘాన్ని సుప్రీం కోర్టు అనుమతించింది.

❖ రుణాలపై వడ్డీ రేట్లు సహేతుకంగా ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

❖ విపత్తు బాధిత రాష్ట్రాలకు 1,066 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ విదేశీ పర్యటన ముగించుకుని ఈరోజు భారత్ చేరుకున్నారు. ఘనా, ట్రినిడాడ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల దేశాల పర్యటనలో ఆయా దేశాలతో భారతదేశానికి ఉన్న సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు చర్చలు జరిపారు. అదేవిధంగా రియో డి జెనీరో నగరంలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి కూడా నరేంద్ర మోదీ హాజరయ్యారు. ప్రపంచ దక్షిణాధి దేశాలతో బంధాలను బలోపేతం చేయడం, అట్లాంటిక్ దేశాల భాగస్వామ్యాలను పటిష్ట పరిచేందుకు బ్రిక్స్ వంటి వేదిక ద్వారా భారతదేశ బలాన్ని మరింత పెంచే లక్ష్యంగా ఈ పర్యటన కొనసాగింది. ఇదిలా ఉండగా ఈరోజు గురు పౌర్ణమిని పురస్కరించుకుని దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

======================

భారత్ ప్రపంచ శక్తిగా ఎదిగేందుకు మేథో సంపత్తి, సాంస్కృతిక పురోగతి చాలా ముఖ్యమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ (IKS)పై ఈరోజు ఢిల్లీలో జరిగిన వార్షిక సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... ఒక దేశ బలం ఆ దేశ విలువలు, మేథో సంపత్తిపై ఆధారపడి ఉంటుదన్నారు. భారతదేశ విశ్వవిద్యాలయాలు ఇప్పటికే అభివృద్ధి చెందుతున్న అభ్యాస కేంద్రాలుగా స్థిరపడ్డాయన్నారు. పురాతన భారత విశ్వవిద్యాలయాలైన తక్షశిల, నలంద, విక్రమశిల, వల్లభి, ఓదంతపురి వంటి విద్యా కేంద్రాలు జ్ఞానానికి నిలయాలుగా నిలిచాయని జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

======================

బీహార్ ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టేందుకు ఎన్నికల సంఘాన్ని సుప్రీం కోర్టు అనుమతించింది. దీనిపై దాఖలైన పిటిషన్ పై సుప్రీం కోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం చర్యను రాజ్యాంగబద్ధమైనదేనని స్పష్టం చేసింది. ప్రాథమిక ప్రతాలుగా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ తో పాటు ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డును పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. దాదాపు 20 ఏళ్ల క్రితం ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగిందని వ్యాఖ్యానించింది.

======================

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నియమావళిని అనుసరించి పని చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన NBFC సింపోజియం 2025లో ఆమె ప్రసంగిస్తూ... బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు రుణ వసూలు పద్ధతులను న్యాయ బద్దంగా, గౌరవప్రదంగా అమలు చేయాలన్నారు. వినియోగదారుల అవసరాలు, తిరిగి చెల్లించే సామర్థ్యం ఆధారంగా రుణాలు ఇవ్వాలని బ్యాంకులకు ఆమె సూచించారు. రుణాలపై వడ్డీ రేట్లు సహేతుకంగా ఉండాలని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ..

(వాయిస్ 33 సెకన్లు)

======================

దేశంలో ఆరు విపత్తు బాధిత రాష్ట్రాలకు 1,066 కోట్ల రూపాయలకు పైగా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వరదలు, కొండచరియలు విరిగిపడిన అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, కేరళ, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించనుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం సుమారు అస్సాం రాష్ట్రానికి 375 కోట్ల రూపాయలు, మణిపూర్‌కు 29 కోట్లు, మేఘాలయకు 30 కోట్లు, మిజోరాంకు 22 కోట్లు, కేరళకు 153 కోట్లు, ఉత్తరాఖండ్‌కు 455 కోట్ల రూపాయలకు పైగా నిధులు మంజూరు చేసింది. నైరుతి రుతుపవనాల సమయంలో అతి భారీ వర్షాలు, వరదలు కొండచరియలు విరిగిపడటంతో ఈ రాష్ట్రాలు అత్యంత ప్రభావితమయ్యాయి.

విరామం

======================

పునరుత్పాదక ఇంధన సామర్థ్యం వృద్ధిలో భారతదేశం పురోగతిని సాధించిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 11వ ఇండియన్ ఎనర్జీ స్టోరేజ్ వీక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సౌర సామర్థ్య వృద్ధిలో 4,000 శాతం పెరుగుదలను సాధించమన్నారు. విద్యుత్ బిల్లులను తగ్గించాలనే లక్ష్యంతో "పిఎం సూర్య ఘర్ యోజన" పథకం ద్వారా కోటి ఇళ్లకు సౌర ఫలకలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో సౌర పంపుల విస్తరణకు "పిఎం కుసుమ్ యోజన" పథకం ఎంతో

దోహదపడుతుందన్నారు. జాతీయ ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా పరిశోధన, నైపుణ్య అభివృద్ధికి సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని పియూష్ గోయల్ పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

======================

సాంకేతికత ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండళ్లను బలోపేతం చేసేందుకు నీతి ఆయోగ్ ఈరోజు న్యూఢిల్లీలో కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. దీనిని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీతో కలిసి ప్రారంభించారు. ప్రాంతీయ ఆవిష్కరణలు, శాస్త్రీయ పురోగతి, స్థిరమైన అభివృద్ధికి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండల్లు సహాయపడేందుకు అవసరమైన అవకాశాలను, సంస్కరణలను ఈ కార్యచరణ ప్రణాళిక ప్రతిపాదిస్తుందని నీతి ఆయోగ్ పేర్కొంది.

======================

వికసిత్ భారత్ 2047 దార్శనికతను సాధించేదుకు విశ్వవిద్యాలయాలు ప్రణాళికలను రూపొందించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. గుజరాత్‌లోని కెవాడియాలో కేంద్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సమావేశం ఈరోజు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ... విద్యా వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వ చర్యల ఫలితంగా అత్యధిక విశ్వవిద్యాలయాలు, కళాశాలలు స్థాపించబడి, ప్రపంచ వ్యాప్తంగా అతిపెద్ద వ్యవస్థలలో భారతదేశం ఒకటిగా నిలిచిందన్నారు. డిజిటల్ వ్యవస్థలను నిర్మించడం, పాఠ్యాంశాలను పునర్నిర్మించడంలో అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం వంటి విధానాలను ప్రోత్సహించాలని సూచించారు. దేశ విద్యార్థులను ఉద్యోగ సృష్టికర్తలు, నైతిక ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దాలని ధర్మేంద్ర ప్రధాన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ...

(వాయిస్ 27 సెకన్లు)

======================

అండర్‌సన్, టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్ లండన్ లోని లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న మూడవ టెస్ట్ మ్యాచ్ లో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో టీ విరామ సమయానికి 2 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది.

======================

వాయువ్య భాతదేశంలోని పలు ప్రాంతాల్లో రాగల రెండు మూడు రోజులు భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో ఆరెంజ్ అలర్ట్ ను ప్రకటించింది. అలాగే రానున్న 4, 5 రోజులలో మధ్య భారతదేశంలో పలు రాష్ట్రాలలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

======================
======================